క్లుప్తంగా

'మహిళలకు అండగా షీటీం'

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు అండగా షీ టీం పని చేస్తుందని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు షీటీం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు షీటీం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, షీటీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ వహించాలి

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు అన్నారు. మండలంలోని నదిమాబాద్ ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 3వ తరగతి విద్యార్థులకు నవంబర్‌లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ఉంటుందన్నారు. న్యాస్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని, చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట సీఆర్పీ దేవన్న ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న తుడుందెబ్బ నాయకులు

లింగాపూర్: మండలకేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను తుడుందెబ్బ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఆత్రం అనిల్‌కుమార్, ఆత్రం శేషునారాయణ మాట్లాడుతూ ఆగస్టు 9న జైనూర్ మండలంలో నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పెందూర్ మారుతి, బాదిరావు, రామారావు, లాల్‌శావు, వెంకట్, జంగు, మహాదు పాల్గొన్నారు.

కెరమెరి: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అన్ని ఆదివాసీ గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హట్టితో పాటు సాకడ చౌరస్తాల్లో ఉన్న భీం విగ్రహాలకు పూలమాల వేయాలని పేర్కొన్నారు. నాయకులు మడావి రఘునాథ్, అంబారావు, సోము, ఆనంద్‌రావు, వినేష్, రాము, సాగర్, సోనేరావు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బెజ్జూర్: మండలంలోని ఏటిగూడ గ్రామానికి చెందిన మాడే అన్నాజీ బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తొర్రెం జలపతి, నెల్లి మహేశ్, ఇప్పకాయల శంకర్, సడమేక గుండయ్య, సడమేక వెంకటి, మల్లయ్య, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న థర్డ్ పార్టీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు చిరంజీవి, శ్రీశైలం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సిర్పూర్(టి): జనగాం జిల్లాకేంద్రంలో న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కోర్టులో న్యాయవాదులపై దాడులు చేయడం హేయమైన చర్య అని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, న్యాయవాదులు రైస్ అహ్మద్, శంకర్‌రావు, శ్రీనివాస్, గణపతి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ధరలు..!

- పెరిగిన కూరగాయల ధరలు
- వర్షాలతో తగ్గిన దిగుబడి
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు

ప్రస్తుతం కూరగాయల ధరలు (కేజీకి, రూపాయల్లో)..

కూరగాయలు	ధర
టమాట	60
మిర్చి	100
బెండకాయ	60
బీరకాయ	60
దొండకాయ	55
చిక్కుడుకాయ	100
కాకరకాయ	80
వంకాయ	80
క్యాబేజీ	100
క్యాలీఫ్లవర్	80
క్యారెట్	80
మునగకాయ	150


రెబ్బెనలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రెబ్బెన: మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. గత కొన్ని రోజులుగా మార్కెట్‌లో కూరగాయల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. ఏ కూరగాయ ధర చూసిన కిలోకు రూ.50కు పైమాటే. దీంతో కూరగాయల ధరలు వింటేనే సామాన్య, మధ్య తరగతి ప్రజలు జంకుతున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో కూరగాయల దిగుబడి తగ్గిపోయింది. మార్కెట్‌లో డిమాండ్‌కు స రిపడా కూరగాయల సరఫరా లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

పప్పులతో సరిపెట్టుకుంటున్న సామాన్యులు..

గత కొన్ని రోజులుగా కూరగాయల మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. ఏ రకం కూరగాయలు కొనాలన్నా వాటి ధర రూ.50కి పైనే ఉంటుంది. దీంతో సామాన్యులు వందల రూపాయలు ఖర్చు చేసి కూరగాయలు కొనుగోలు చేసే బదులు పప్పులు, ఇతర సరుకులతో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయల ధరలు అమాంతం పెరగడానికి వర్షాలే కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. మండలంలోని గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి, పాశిగాం, లక్ష్మీపూర్ తదితర ప్రాంతాల రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో మండలంలోని రైతులు, వంకాయ, బీరకాయ, అలసంద, బెండకాయ వంటివి సాగు చేస్తున్నారు. అయితే ఈసారి బీర తోటలకు ఆకు ముడత తెగుళ్లు అధికంగా సోకడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వంకాయ, ఇతర కూరగాయలు సైతం అంతంత మాత్రంగానే కాస్తున్నాయి. ఇక కాకర, క్యాబేజీ, కాలీఫ్లవర్, కొత్తిమీర, క్యారెట్, బీట్‌రూట్, దొండకాయ, మిర్చి వంటి వాటిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు.

శ్రావణం ఎఫెక్ట్..

ఆషాఢం పూర్తయి శ్రావణమాసం ప్రారంభం కావడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. ఇది కూడ కూరగాయల ధరల పెరుగుదలకు ఒక కారణంగా వ్యాపారులు భావిస్తున్నారు. దిగుబడి తగ్గిపోయి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ కావడంతో ధరలు విపరీతంగా పెరిగినట్లు చెబుతున్నారు. వానాకాలం సీజన్ కావటంతో అపరిశుభ్ర వాతావరణంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇలాంటి సమయంలో మాంసాహారం వైపు వెళ్లకుండా ఉండటమే ఉత్తమమని ప్రజలు భావిస్తుంటారు. దీనికి తోడూ శ్రావణమాసం పూర్తయ్యే వరకు చాలా మంది మాంసాహారం తీసుకోరు. దీంతో మార్కెట్‌లో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. అయితే మరో 20 రోజుల వరకు ధరలు ఇదే స్థాయిలో ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. వర్షాలు కాస్త తగ్గుముఖం పడితే దిగుబడి పెరిగి ధరలు దిగి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఏదైమైనా పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు సతమతమవుతున్నారు.

బాగా పెరిగాయి



గత కొన్ని రోజులుగా కూరగాయల ధరల బాగా పెరిగాయి. వర్షాల మూలంగా మార్కెట్‌కు కూరగాయలు రావడం లేదు. దీంతో ధరలు బాగా పెరిగాయి. పెరిగిన ధరలను చూసి కస్టమర్లు తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. వారం రోజులుగా మార్కెట్ కూడా చాలా డల్‌గా నడుస్తోంది.
– ఇర్షాద్, కూరగాయల వ్యాపారి

ఎస్సీ డిక్లరేషన్‌కు నిధులు కేటాయించాలి

బెజ్జూర్: ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి అన్నారు. బుధవారం దళిత మోర్చా బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రధాన హామీలు అంబేడ్కర్ అభయ హస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు, తదితర అంశాలపై బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. వెంటనే నిధులు కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశామన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, జాడి దిగంబర్, తాళ్ల రామయ్య, లింగాల శంకరయ్య, గూడ రాకేశ్, జాడి లక్ష్మణ్, బిబ్బర మొగిలి తదితరులు ఉన్నారు.


బెజ్జూర్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పుల్లిబోగి బందురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం, నాయకులు మిథున్, భూమయ్య, సత్తయ్య, సునీల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


గుంతల్లో కంకర వేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కౌటాల: మండల కేంద్రంలోని కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై గల గుంతల్లో కౌటాల ఎంపీడీవో కోట ప్రసాద్, ఎస్సై మధుకర్ బుధవారం కంకర వేసి గుంతలను పూడ్చారు. ఇటీవల 'సాక్షి'లో 'వామ్మో.. ఇవేం రోడ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ ఏరియా, శ్యాంమోడల్ స్కూల్, తలోడి చౌరస్తాలో గల భారీ గుంతల్లో కంకర వేశారు. వర్షాలకు రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని ట్రాక్టర్‌తో తొలగించారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పెంచికల్‌పేట్: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సిర్పూర్(టి) ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఎల్లూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి తల్లి ఆహారంలో పోషకాహారం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: పిల్లల పెరుగుదలకు తల్లిపాలు దోహదపడుతాయని సూపర్‌వైజర్ యశోద అన్నారు. బుధవారం మండలంలోని వట్టివాగు కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లి పాల వారోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించాలన్నారు. తల్లిపాలతో పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. జిల్లా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ గోపాల్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సునీత, ఏఎన్ఎం, ఆశ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్: ఎల్లూర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రాధాన్యతను గర్భిణీలు, బాలింతలకు వివరించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాల వల్ల శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గుణసుందరి తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి: మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం ఆమె నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఇటన్‌కార్ పురుషోత్తం, మాసగోని సాగర్ గౌడ్‌కు మంజూరైన చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తెకారాం, తదితరులు ఉన్నారు.

ట్రస్మా బలోపేతానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్: ట్రస్మా బలోపేతానికి కృషి చేస్తానని ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కిషన్‌రావు అన్నారు. ఇటీవల ట్రస్మా అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ట్రస్మా జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కిషన్ రావును శాలువాతో సన్మానించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవ భూషణం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి రాజేందర్, నాయకులు రాధాకృష్ణ, తిరుపతి, నరేందర్, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం రవిప్రసాద్‌ను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. యాజమాన్యం రెండు రోజుల క్రితం జీఎం రవిప్రసాద్‌ను మార్కెటింగ్ జీఎంగా బదిలీ చేయడంతో దాన్ని పురస్కరించుకొని ఏఐటీయూసీ నాయకులు జీఎంను కలిసి సన్మానించారు. ఏరియాలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఏరియా అభివృద్ధికి జీఎం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, చంద్రశేఖర్, శేషశయనరావు, కిరణ్‌బాబు, రాజేశ్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీజీఎంకు సన్మానం..

గోలేటి సీహెచ్‌పీ డీజీఎంగా పని చేసి బదిలీపై వెళ్తున్న భీంరావు జాడేను బుధవారం కార్మికులు ఘనంగా సన్మానించారు. సీహెచ్‌పీ డీజీఎంగా పని చేస్తున్న భీంరావు జాడేను సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లి ఏరియా ఇంజనీర్‌గా బదిలీ చేసింది. ఈ సందర్భంగా సీహెచ్‌పీలో పని చేస్తున్న కార్మికులు డీజీఎంను సన్మానించి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ షిఫ్టు ఇన్‌చార్జి ఎండీ ఆదం సమీ, నాయకులు శ్రీనివాస్, గజ్జల రాజయ్య, ప్రభాకర్, అమర్‌సింగ్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్తున్న డీజీఎంను సన్మానిస్తున్న కార్మికులు

సదాశివ సేవలు చిరస్మరణీయం

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత డాక్టర్ సామల సదాశివ సాహితీ సేవలు చిరస్మరణీయమని తెలుగు సాహితీ సదస్సు అధ్యక్షుడు పెండ్యాల కిషన్ శర్మ అన్నారు. బుధవారం సదాశివ వర్ధంతి సందర్భంగా తెలుగు సాహితీ సదస్సు ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల సదాశివ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సాహితీ సదస్సు సభ్యులు కటుకం మధుకర్, మామిడాల తిరుపతయ్య, శ్యాంసుందర్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ –దహెగాం ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని బుధవారం విద్యార్థులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. కాగజ్‌నగర్ నుంచి దహెగాంకు వెళ్లే ప్రధాన రహదారి భట్‌పల్లి సమీపంలో గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని బుధవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. దీంతో గంటసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై రామన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థుల డిమాండ్ మేరకు ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో మాట్లాడించారు. ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం

కాగజ్‌నగర్‌రూరల్: చేనేత కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కోసిని గ్రామంలో గల చేనేత సహకార సొసైటీని ఆయన సందర్శించారు. చేనేత కార్మికులు నేస్తున్న వస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో చేనేత సహకార సొసైటీ నాయకులు కనకయ్య, రాజమౌళి, రాజన్న, రేహాన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు పరిశీలించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ నిర్మాణ పనులను పరిశీలించడంతో పాటు స్టేషన్‌లోని మౌలిక సదుపాయాల గురించి రైల్వే అధికారులతో చర్చించారు. పట్టణంలోని సంజీవయ్యకాలనీ వద్ద మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. స్టేషన్ మాస్టర్ కైలాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, రైల్‌యాత్ర కమిటీ అధ్యక్షుడు ప్రయాగ్ తివారి, నాయకులు శ్రీనివాస్, రమేశ్, కార్తీక్, పవన్, సౌరబ్, అర్జున్ పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పట్టణంలోని నౌగాంబస్తీలోని మైసమ్మ ఆలయంలో అమ్మవారిని బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు దర్శించుకున్నారు. అనంతరం కాలనీలోని సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు దారి పట్టి గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి వాటికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకుడు భీంరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపడానికి సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో గంజాయి సాగు చేసిన విక్రయించిన పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం -పచ్చదనం'

కెరమెరి: జిల్లాలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని సావర్‌ఖెడా, మెట్టపిప్రి గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛతపై దృష్టి సారించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. మురికి నాలాలు శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్మీ కంపోస్టు పిట్‌లను పరిశీలించారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మానిక్‌గూడ గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్ చుట్టూ పరిసరాలను శుభ్రం చేయించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీపీ ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కౌటాల: పల్లెలు పచ్చదనంగా ఉండాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఆయన మొక్కలు నాటారు. తాగునీటి చేతిపంపులు, పైప్‌లైన్ల వద్ద మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీపాద రావు అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ, హైకాజీనగర్, ఫిల్టర్‌బెడ్ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. వబ్యూనిటీ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది ఆనందం, భద్రయ్య, వంశీ, ఉదయ్, బాబురావు, శంకర్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌రూరల్: అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో మొక్కలు నాటేలా చూడాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీపాదరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా స్వచ్ఛదనం -పచ్చదనం నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అంతకుముందు ప్రత్యేకాధికారికి కమిషనర్ అంజయ్య పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మేనేజర్ క్రాంతి, సిబ్బంది రఫీక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: తపాలాశాఖలో ఉన్న ఇన్సూరెన్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ తపాలా సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన తపాలా ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ ప్రీమియం రూ.549లతో రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీ పొందవచ్చన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తపాలా ఉద్యోగులను సత్కరించి బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ పుల్లూరి సంతోష్ గ్రామీణ పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మంచిర్యాల ఐపీపీబీ మేనేజర్ వెంకటస్వామి, సాగర్, సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్, పోస్టుమాస్టర్ కృష్ణ, ఎంవో గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవిరెడ్డి సిద్ధార్థ

సంక్షిప్త వార్తలు

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

దహెగాం: మండలంలోని కల్వాడ తండా గ్రామానికి చెందిన ఐలావత్ బాలు అనే రైతుకు చెందిన ఎద్దు బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఎద్దు పొలం వద్ద మేత మేస్తుండగా విద్యుత్ లైన్ స్తంభం సపోర్ట్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

జైనూర్: మండలంలోని మార్లవాయిలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయుడు యాసిఫ్ షరీఫ్‌ను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. 30 ఏళ్ల క్రితం అరకొర వసతుల మధ్య విద్యార్థులకు పాఠాలు బోధించిన ఆయన తిరిగి అదే పాఠశాలకు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వరరావు, రాయిసెంటర్ సార్మేడి జుగనక దేవురావు, తాజా మాజీ సర్పంచ్ కనక ప్రతిభ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దహెగాం: మండలంలోని ఐనం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఐనం గ్రామానికి చెందిన కొండగుర్లె మహేందర్ ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు చేశారు. మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్, మధు, రమేశ్ పాల్గొన్నారు.